క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



గోపాల్‌పేట: ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి విశేషంగా నిధులు మంజూరు చేస్తోందని ఏదుల సర్పంచ్ నాగమణి అన్నారు. మంగళవారం మండలంలోని ఏదులలో సీసీరోడ్డు పనులను సర్పంచ్ ప్రారంభించారు. సీసీ రోడ్ల నిర్మాణంతో కాలనీల్లో, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌తో సీసీ రోడ్డు ధ్వంసం



ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడలో నాయకుల మధ్య నెలకొన్న భూసమస్యలతో సీసీ రోడ్డును ధ్వంసం చేశారు. గ్రామానికి ఉపాధి హామీ నిధుల ద్వారా సీసీ రోడ్లకు నిధులు మంజూరయ్యాయి. పనుల్లో భాగంగా గ్రామంలోని బోయ శ్రీను ఇంటి నుంచి చెన్నయ్య ఇంటి వరకు 80 మీటర్ల సీసీ రోడ్డును మంగళవారం ఉదయం సర్పంచ్ ఆధ్వర్యంలో వేశారు. అదే గ్రామానికి చెందిన ఓ నాయకుడు తన భూమిలో సీసీ రోడ్డు ఎలా వేస్తారని ట్రాక్టర్ నాగళ్లతో దున్నారు. చివరకు గ్రామ పెద్దలంతా కలిసి మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకున్నారు. సీసీ రోడ్డును పాడు చేయకుండా సమస్యను పరిష్కరించుకుందామని ఒప్పందం చేసుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అమరచింత: అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశామని ఆత్మకూర్ ఏఎస్ఐ బీచుపల్లి తెలిపారు. మండలంలోని పిన్నంచర్ల శివారులో ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆపి అనుమతి పత్రాలు పరిశీలించగా.. ప్రభుత్వ అనుమతులు లేకుండా చిన్నచింతకుంట మండలం అల్లీపురం ఊకచెట్టు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్ మన్యంబాబుపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లిలో జనుంపల్లి సుధాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు భాస్కర్‌రెడ్డి సహకారంతో 'ఛత్రపతి శివాజీ యూత్' అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఫైనల్‌లో చింతకుట యూత్ క్రికెట్, దొడగుంటపల్లి ఛత్రపతి శివాజీ యూత్ టీంలు తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో చింతకుంట టీం విజేతగా నిలవడంతో రన్నర్‌గా దొడగుంటపల్లి ఛత్రపతి శివాజీ టీం నిలిచింది. విజేత టీంకు రూ.20వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన టీంకు రూ.10వేల నగదును నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, జానకీరాములు, రాజశేఖర్‌శెట్టి, బాలప్ప, కొండమ్మ, సుదర్శన్, నరేందర్‌గౌడ్, వినోద్‌కుమార్‌రెడ్డి, గోపాల్‌చారి తదితరులు ఉన్నారు.

విత్తనాల పంపిణీ

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంతోపాటు వెనచర్లలో సబ్సిడీ మినుములను ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నాగరాజు రైతులకు మంగళవారం పంపిణీ చేశారు.

సబ్‌స్టేషన్ నిర్వహణలో నిర్లక్ష్యం

- శిథిల భవనంలోనే కార్యాలయం కొనసాగింపు
- ఆరుబయటే విలువైన విద్యుత్ పరికరాలు
- ప్రహరీ లేక ఇబ్బందులు



శిథిలావస్థలో సబ్‌స్టేషన్ గది



ఆరుబయటే ఉంచిన విద్యుత్ పరికాలు

వీపనగండ్ల: రైతుల అవసరాల కోసం రూ.లక్షలు ఖర్చు చేస్తున్నామని చెప్పుకునే ప్రభుత్వం విద్యుత్ సరఫరాలో కీలక భూమిక పోషిస్తున్న సబ్‌స్టేషన్‌లో సరైన వసతులు కల్పించకపోవడంతో సబ్‌స్టేషన్ సిబ్బంది, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌కు ప్రహరీ లేకపోవడంతో మూగజీవాలకు ప్రమాదం పొంచి ఉందని రైతులు పలుమార్లు ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వసతులు సమకూర్చడంపై అధికారులు దృష్టి సారించలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సబ్‌స్టేషన్‌లో కనీస వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

36 ఏళ్ల క్రితం నిర్మాణం

1987 సంవత్సరంలో ఆనాటి విద్యుత్ శాఖ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మండల కేంద్రంలో 33/11 సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సబ్‌స్టేషన్ ద్వారా వీపనగండ్ల, సంగినేనిపల్లి, తూంకుంట, వెలగొండ, దగడపల్లి ఫీడర్లను ఏర్పాటు చేసి వందలాది మంది రైతుల వ్యవసాయ మోటార్లకు నిత్యం విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. కానీ సబ్‌స్టేషన్ సిబ్బంది కోసం నిర్మించిన రేకుల షెడ్డు శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉంది.

పొంచి ఉన్న ప్రమాదం

సబ్‌స్టేషన్ చుట్టూ ఏర్పాటు చేసిన కంచె పూర్తిగా పాడవడంతో పంట పొలాలకు వెళ్లే మూగజీవాలు, గొర్రెలు, మేకలు సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్తుండడంతో ప్రమాదం పొంచి ఉందని రైతులు, గొర్రెల కాపర్లు వాపోతున్నారు. విలువైన విద్యుత్ పరికరాలను సైతం సబ్‌స్టేషన్ కంపౌండ్ లోపల ఉంచుకోవాల్సి ఉండగా సబ్‌స్టేషన్ సమీపంలో ఆరుబయటే ఉంచుతున్నారు. కనీస వసతులు లేకపోవడంతో రాత్రి వేళల్లో పనిచేసే సిబ్బంది విషసర్పాలు వచ్చే ప్రమాదం ఉందని భయం భయంగా పనిచేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అవసరమైన వసతులు కల్పించాలని మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

మూగజీవాలకు ఇబ్బందులు



మండల కేంద్రానికి సమీపంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ప్రహరీ నిర్మించకపోవడంతో మూగజీవాలు ప్రమాదం బారిన పడే పరిస్థితి నెలకొంది. విద్యుత్ స్తంభాలు సైతం ప్రధాన రోడ్డుకు దగ్గర్లో ఉంచడంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

– ఆవుల నారాయణ, రైతు, వీపనగండ్ల

ప్రత్యేక నిధులు కేటాయించాలి



శిథిలావస్థకు చేరుకున్న సబ్‌స్టేషన్‌లో వసతుల కల్పించడానికి నిధులు కేటాయించాలి. రాత్రి, పగలు షిఫ్టుల వారిగా పనిచేసే ఉద్యోగులకు శిథిలమైన రేకుల షెడ్డు వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి సమస్య పరిష్కరించాలి.

– నర్సింహారెడ్డి, సర్పంచ్ వీపనగండ్ల

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

సబ్‌స్టేషన్ ప్రహరీ నిర్మాణం, సిబ్బంది గదిలో మెరుగైన వసతుల ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతాం. విద్యుత్ వినియోగదారులు, రైతులు చెల్లించాల్సిన బకాయిలను సకాలంలో చెల్లించి అధికారులకు సహకరించాలి. ఉన్నతాధికారులను క్షేత్రస్థాయిలో పరిశీలించమని కోరుతాం.

– అప్పుల నాయుడు, ట్రాన్స్‌కో ఏఈ, వీపనగండ్ల

ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న బి.కృష్ణ

వనపర్తి క్రైం: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ రాష్ట్ర మంత్రివర్గం రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద బీజేపీ నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనకు ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు సంబంధం ఉందని, కేటీఆర్ వ్యక్తిగత సహాయకుడు తిరుపతి ఈ ఘటనలో సూత్రధారి అని ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని శాఖల్లో కంప్యూటర్ల నిర్వహణ జరుగుతుందని, లీకేజీ ఘటన వెలువడిన వెంటనే న్యాయ విచారణ లేకుండా ఇద్దరు వ్యక్తులు లీకేజీకి పాల్పడ్డారని కేటీఆర్ తెలపడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. లీకేజీకి కేటీఆర్ బాధ్యత వహిస్తూ స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. దీక్షలో శ్రీశైలం, జింకల కృష్ణయ్య, కొమ్ముసామేల్, వెంకటేశ్వర్‌రెడ్డి, సీతారాములు, పెద్దిరాజు, బచ్చురాం, అనుజ్ఞారెడ్డి, కల్పన, నరసింహ, నారాయణ తదితరులు ఉన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

చిన్నంబావి: కేంద్రం ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మార్చి 17 నుంచి 29 వరకు నిర్వహిస్తున్న జనచైతన్య బస్సు యాత్రలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తుందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ తదితర నిత్యావసర ధరలను పెంచుతూ ప్రజలపై నిత్యం భారం మోపుతుందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని, నిత్యావసర ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలనే డిమాండ్లతో యాత్ర చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తాం అని ఇచ్చిన వాగ్దానం మోదీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కులమతాల మధ్య తగాదాలు పెట్టి, విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీ పాలనను ఎండగట్టాలని కోరారు. కార్యక్రమంలో చుక్క రాములు, సాగర్, సీపీఎం మండల కార్యదర్శి రాజేందర్‌గౌడ్, వెంకటస్వామి, వెంకటేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కొరత నివారించేందుకు చర్యలు



బీసీ కాలనీలో సోర్స్ బోర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: పట్టణంలో వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. రెండు రోజుల కిందట బీసీ కాలనీలో ఉన్న సోర్స్ బోరు రిపేరు కావడంతో హుటాహుటిన వాటికి మరమ్మతు చేయించి తాగునీటి సరఫరాను మంగళవారం పునరుద్ధరించారు. ఈమేరకు మున్సిపల్ వాటర్‌మెన్లతో కలిసి పట్టణంలో ఆయా వార్డుల్లో ఉన్న తాగునీటి సోర్స్ బోర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని పది వార్డుల్లో మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించడమే కాకుండా, పట్టణంలో మున్సిపాలిటీకి చెందిన 16 తాగునీటి సోర్స్ బోర్ల ద్వారా క్రమం తప్పకుండా తాగునీటిని అందిస్తున్నామన్నారు. ఆయా వార్డుల్లో తాగునీటి ఇబ్బందులు కలిగితే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. అదే విధంగా పట్టణంలో నూతనంగా సీసీ రహదారులు నిర్మిస్తున్నామని, కొత్తగా ఎవరైన తాగునీటి కోసం వ్యక్తిగత కుళాయిలు అవసరం అనుకుంటే దరకాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్ పాల్గొన్నారు.

ఆలయ భూమిపై ఓఆర్సీ రద్దు చేసే వరకు పోరాటం



ర్యాలీ నిర్వహిస్తున్న ఆలయ భూమి పరిరక్షణ సమితి సభ్యులు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని సంత నిర్వహిస్తున్న శ్రీవేణుగోపాలస్వామి ఆలయ భూమిపై ఉన్న ఓఆర్సీ రద్దు చేసి దేవుడికి చెందే వరకు ఆలయ భూమి సంరక్షణ సమితి సభ్యులు పోరాటం చేస్తామని మంగళవారం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్షం ఆధ్వర్యంలో శ్రీవేణుగోపాలస్వామి ఆలయం నుంచి పట్టణంలోని ప్రధాన రహదారిపై కొల్లాపూర్ చౌరస్తా, మున్సిపాలిటీ కార్యాలయం వరకు మౌన ర్యాలీ నిర్వహించారు. అధికారులు, ఇటు పాలక వర్గం సభ్యులు ఆలయ భూమిపై స్పష్టత ఇవ్వడానికి ముందుకు రావడం లేదని ఆరోపిస్తూ శ్రీవేణుగోపాలస్వామి ఆలయ భూమి దేవునికే చెందాలి, సంత స్థలాన్ని కాపాడే వరకుల పోరాటం చేస్తామని మున్సిపల్ కమిషనర్ జాన్ కృపాకర్‌కు వినతిపత్రం అందజేశారు. 23న మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పార్వతిగౌడ్, సువర్ణ యాదవ్, నాయకులు విజవర్ధన్‌రెడ్డి, గౌని వేమారెడ్డి, గోల్డ్ బాలస్వామి, దయాకర్‌రెడ్డి, గోనేల సహదేవుడు, రమణ, వెంకట్రాములు, సత్యనారాయణ, ఘనపురం కృష్ణయ్య, రాజశేఖర్, రామన్‌గౌడ్, బస్వరాజ్‌గౌడ్, సంతోష్, కంచె అంజనేయులు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



శ్రీరంగాపురంలో వంట చేస్తున్న మహిళలు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ మూడో కేంద్రంలో సూపర్‌వైజర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపం ఉండరాదనే ఉద్దేశ్యంతో చిరుధాన్యాలు, పోషకాలపై అవగాహ కల్పించామన్నారు. వారు రోజూ తీసుకునే ఆహారంలో పోషక విలువలున్న ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఏడాది మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం నుంచి ఏప్రిల్ 3 వరకు పోషక పక్షం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పోషక ఆహారంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు, కార్యదర్శి నందకిషోర్, అంగన్‌వాడీ టీచరు మంజులారాణి, ఆశావర్కర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వీపనగండ్లలో..

వీపనగండ్ల: పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల విలువలతో కూడిన పోషకాలు లభిస్తాయని సర్పంచ్ నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పోషకాలతో కూడిన వంటలు తయారు చేయడంలో మహిళలకు అవగాహణ కల్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్లు తీసుకోవాలని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువ దంపతులు పౌష్టికాహార తయారీపై అవగాహన కలిగి ఉండడం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగేశ్వరమ్మ, ఉపాధ్యాయులు కృష్ణ, సీఆర్పీ వెంకటేశ్, వార్డు సభ్యురాలు శివలీల, అంగన్‌వాడీ టీచర్లు సుగుణాభాయి, మహేశ్వరి, అంగన్‌వాడీ ఆయాలు లచ్చమ్మ, నీరజ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కవులకు సన్మానం

వనపర్తి టౌన్: రవి గాంచిన చోట కవి గాంచును కష్టజీవుల చెంత ఉండి అన్యాయాలను ఎదుర్కొనే శక్తి కవులకు మాత్రమే ఉంటుందని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో టీజేఏసీ క్లాస్‌మేట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కవితా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కవులను సన్మానించారు. కార్యక్రమంలో కవులు గిరి రాజాచారి, జనజ్వాల రాధాకృష్ణ, నరసింహశర్మ, చీర్ల నాగేంద్రంసాగర్, శివలింగం, అస్మ బేగం, రామిరెడ్డి, నాగరాజు, ఈశ్వర్, వెంకటేష్, వెంకటయ్య, కృష్ణయ్య, నాగరాజు, చిన్న నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి

మదనాపురం: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకటయ్య (68) మంగళవారం అనారోగ్యంతో మరణించాడు. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీలో చురుకైన నాయకుడిగా పని చేశారని కార్యకర్తలు గుర్తుచేసుకున్నారు. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని, వారి కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జగదీష్ తెలిపారు. బుధవారం జరిగే అంత్యక్రియలకు కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు.

రంజాన్ మాసంలో ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంఐఎం సభ్యులు

పెబ్బేరు: రంజాన్ మాసంలో ముస్లింలు నిర్వహిస్తున్న ఉపవాస దీక్షలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని మైనార్టీ నాయకులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఐఎం పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్రోజ్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు చేస్తున్న ఉపవాస దీక్షలకు కరెంటు, తాగునీరు, మసీద్ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు, రాత్రి వేళలో నమాజ్ కోసం వెళ్తున్న వారికి సహకరించాలని అధికారులను కోరారు. ముస్లిం వ్యాపారులు, హోటళ్ల నడిపేందుకు వివిధ శాఖల అధికారులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మస్తాన్, ఆమేర్, అక్బర్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

పెంట్లవెల్లి: మల్లేశ్వరంలో మంగళవారం వ్యవసాయ అధికారి గోవిందు, సర్పంచ్ తిరుపాటి నాగరాజు ఆధ్వర్యంలో మహిళలకు, రైతులకు ఆర్థిక అవసరాలు, నిర్వహణ, జాగ్రత్తలపై అధికారి ఎంఎస్ఆర్ ఆంజనేయులు వివరించారు. ఎస్ఈబీఐ సెక్యూరిటీ అండ్ ఎక్సేంజ్ బోర్డుపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పెట్టుబడులు, పొదుపు పథకాలు, సంపద, కెటాయింపులు, వ్యూహ రచన, భద్రతకు సంబంధించిన పథకాలు, ఆర్థిక అవగాహనతో కలిగే లాభాలపై పెట్టుబడిదారికి రక్షణ, ఇబ్బందులు వంటి పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాలి

అమరచింత: ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వ కుట్రల నుంచి రక్షించుకోవాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి అబ్రహం కోరారు. మండల కేంద్రంలో మంగళవారం సీపీఐ నాయకులతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 26, 27 తేదీల్లో కరీంనగర్‌లో రాష్ట్ర విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లుగా ఉపాధి హామీ చట్టం దేశంలో అమలవుతూ పేదల కడుపు నింపుతోందన్నారు. యూపీఏ ప్రభుత్వంలో కమ్యూనిస్టు పార్టీలు పోరాడి దీన్ని సాధించారని గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వం పథకంలో అవినీతి జరుగుతోందనే వంకతో ప్రతి ఏటా నిధులను తగ్గిస్తూ ఎత్తివేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. గత బడ్జెట్‌లో రూ.90వేల కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.60 వేల కోట్లకు తగ్గించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఉపాధి కూలీలకు రోజువారి కూలి రూ.600, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి భాస్కర్, నాయకులు కుతుబ్, ఎర్రన్న, పొలు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు వైద్యం

పాన్‌గల్: సీఎం సహాయనిధి పేద వర్గాలకు వరం లాంటిదని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని శాగాపూర్‌కు చెందిన కొప్పునమోని భీముడుకు మంజూరైన రూ.10వేల చెక్కును ఆయన అందించారు. సీఎం సహాయనిధితో పేద కుటుంబాలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు హలీంపాష పాల్గొన్నారు.

మాందాపూర్‌లో..

మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన రాణికి మంజూరైన రూ.22వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, దస్తగిరి, కృష్ణయ్య, వెంకటయ్య, కురుమూర్తి,బాలయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'పై ప్రచారం నిర్వహించాలి

పాన్‌గల్: మండలంలోని దొండాయిపల్లిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం మండల ప్రత్యేకాధికారి సురేష్ మండల స్థాయి అధికారులతో కలిసి తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ కల్ని కాంతి పరిశీలించారు.